క్లుప్తంగా

గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులకు చెక్


సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ

రేగిడి : గ్రామాల్లో ప్రజలకు వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాధరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటి శాఖ అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ముందస్తుగా దృష్టి సారించి మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లు బాగు చేయాలని సూచించారు. ఈఓపీఆర్‌డీ నాగభూషణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా 'అంగన్‌వాడీ'ల నిర్వహణ


ఉంగరాడ అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీఓ

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని రాజాం సీడీపీఓ డాక్టర్ కనకదుర్గ సూచించారు. మండలంలో ఉంగరాడ – 1, ఉంగరాడ – 2 అంగన్వాడీ కేంద్రాలతో పాటు మెట్ట, సంకిలి తదితర అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కేంద్రాలకు అందిస్తున్న పౌష్టికాహార నిల్వలు, పిల్లల ఆరోగ్యం, పౌష్టికాహారం పంపిణీ తదితర వాటిపై ఆరా తీశారు. కేంద్రాల పనితీరు బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు.

కుల జనగణనతో ఎంతో మేలు


మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సరస్వతి

రామభద్రపురం: కుల జనగణనతో అన్ని సామాజిక వర్గాలకు చెందిన ప్రజలకు మేలు జరుగుతుందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి అన్నారు. బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడుతో కలిసి బుధవారం వారు మాట్లాడుతూ కుల జనగణన నిర్వహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమవుతుందన్నారు. కులాల వారీ లెక్కలు తేలితే జనాభా ప్రాతిపదికన నిధులు, విద్య, ఉద్యోగం, పదవులు దక్కుతాయన్నారు. వారితో పారాది సర్పంచ్ ఉత్తరావిల్లి ధనంజయనాయుడు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య


మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యులు

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని, అన్ని రకాల వసతులు పాఠశాలల్లో ఉన్నాయని జెడ్పీటీసీ బండి నర్సింహులు అన్నారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో బుధవారం పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. పాఠశాల హెచ్‌ఎం టి.భారతి, సర్పంచ్ బండి బోడమ్మ, ఎంపీటీసీ బింగి కోటేశ్వరి, విద్యా కమిటీ చైర్మన్ బండి శశికళ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష


సమీక్షలో పాల్గొన్న అధికారులు

రాజాం: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు వేసవిలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని పలు శాఖల అధికారులను ఎంపీపీ లావేటి సులోచన, ఎంపీడీఓ బాసూరి శంకరరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో పాటు సచివాలయ ఉద్యోగులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. తాగునీటి సదుపాయంపై ఆరా తీశారు. గ్రామాల్లో మురుగు కాలువల్లో చెత్త చెదారం తొలగించడం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్వహణపై సమీక్షించారు. వీధి దీపాలు ఏర్పాట్లు, స్తంభాలు పునరుద్ధరణ తదితర అంశాలపై సమీక్షించారు. వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగుతోంది. ప్రజల ఆశీర్వాదంతో ఇంటింటికీ జగనన్న స్టిక్కర్లు అతికిస్తున్నారు. రాష్ట్ర భవిష్యత్తు కూడా జగనన్నతోనే సాధ్యమని ప్రజలు చెబుతూ ముందుకు సాగుతూ ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


రాజాం: పెనుబాకలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో జెడ్పీటీసీ తదితరులు


బొబ్బిలి: గొల్లపల్లిలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు ఆధ్వర్యంలో జరుగుతున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం


రేగిడి: ఉంగరాడలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం


బాడంగి: జీకేఆర్ పురంలో ప్రచారం చేస్తున్న కన్వీనర్ పిన్నింటి కృష్ణమూర్తి తదితరులు


తెర్లాం: డి.గదబవలసలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ప్రజల అభిప్రాయాన్ని సేకరిస్తున్న పార్టీ నాయకులు, గృహసారథులు


సంతకవిటి: గోవిందపురంలో పాల్గొన్న జేసీఎస్ కన్వీనర్ రమేష్‌నాయుడు


రామభద్రపురం: చొక్కాపువారి వీధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

అమ్మవారి దీవెనలు అందరిపై ఉండాలి

- బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని కాలంరాజుపేట గ్రామదేవత శ్రీపైడితల్లి అమ్మవారి చల్లని దీవెనలు ప్రజలందరిపైనా ఉండాలని, ఆ తల్లి ఎల్లవేళలా ప్రజలను కంటికి రెప్పలా కాపాడాలని తాను వేడుకున్నానని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. పైడితల్లి అమ్మవారి పండుగ సందర్భంగా గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల పిలుపుమేరకు బుధవారం ఆయన గ్రామానికి వెళ్లి శ్రీపైడితల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలంతా ఎల్లప్పుడూ సుఖశాంతులతో ఉండాలని, అమ్మవారి ఆశీర్వాదం అన్ని వేళలా ప్రజలపై ఉండాలన్నారు. గ్రామ సర్పంచ్ రమణమూర్తి, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పైడితల్లి అమ్మవారికి పూజలు చేస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి

కథల పుస్తకాలతో చదువుపై ఆసక్తి

రాజాం సిటీ: విద్యార్థులకు కథల పుస్తకాల ద్వారా చదువుపై ఆసక్తి పెంపొందించవచ్చునని ఎంఈఓ పి.నాగయ్య అన్నారు. ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించేందుకు కథల పుస్తకాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. మున్సిపాల్టీ పరిధి బుచ్చెంపేట ఎంపీపీ పాఠశాలలో నెల్లూరుకు చెందిన పీజీఎస్ఎఫ్ సంస్థ లెర్న్ అండ్ హెల్ప్ పేరుతో 560 కథల పుస్తకాలను బుధవారం అందించారు. వీటిని ఆవిష్కరించిన అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు మార్గదర్శిగా ఉంటూ పుస్తకాలు సమకూర్చేందుకు తన వంతు కృషిచేసిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని వడ్డి ఉషారాణిని ఆయన అభినందించారు. హెచ్‌ఎం సురేష్‌కుమార్, డోలపేట హెచ్‌ఎం వీవీ వసంతకుమార్, సీఆర్‌పీ సింహాద్రినాయుడు, ఉపాధ్యాయులు వి.ఉషారాణి, బాలు, ప్రమీల పాల్గొన్నారు.


కథల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ నాగయ్య

ఉపాధి పనుల వద్ద ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండాలి

రేగిడి: ఉపాధి పనులు నిర్వహించే సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మేట్‌లు తప్పనిసరిగా ఉండాలని ఏపీఓ ఎస్.హరనాథ్ సూచించారు. మండలంలో అంబఖండి, సోమరాజుపేట, లింగాలవలస, తాటిపాడు తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఎండలు కారణంగా ఉదయం, సాయంత్రం చల్లగాలి సమయంలో ఉపాధి పనులు చేయాలని, ఎండ తీవ్రత అధికంగా ఉంటే పనులు నిలుపుదల చేసి, ఇంటికి వెళ్లిపోవాలని వేతనదారులకు సూచించారు. జాబ్ కార్డులు ఉన్నవారిని మాత్రమే పనులకు తీసుకురావాలని అన్నారు.


లింగాలవలసలో వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీఓ

సకాలంలో ఉపాధి పనులు చేయండి

బొబ్బిలి: ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకూ తిరిగి సాయంత్రం 3.30 గంటలు దాటిన తరువాత పనులు చేయాలని ఉపాధి హామీ శిక్షణ విభాగం జిల్లా కోర్సు డైరెక్టర్ చిన్నంనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలతో బుధవారం సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరయిన చిన్నంనాయుడు మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున రెండు పూటల పనుల విధానం అమలు చేయాలన్నారు. పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు తప్పనిసరన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ పనులకు వెళ్లాల్సిందేనన్నారు. లేకుంటే సిబ్బందిని బాధ్యులను చేస్తామని చెప్పారు. చెరువు పనులు, నీటి కుంటలు, రింగు కందకాలను ప్రాధాన్యతనివ్వాలన్నారు. ప్రతీ ఫీల్డ్ అసిస్టెంటు క్షేత్ర స్థాయిలో పనుల వద్దకు వెళ్లాలన్నారు. సమావేశంలో ఏపీఓ యాళ్ల జనార్ధన్, ఈసీ శంబంగి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి సిబ్బందికి సూచనలిస్తున్న కోర్సు డైరెక్టర్ చిన్నం నాయుడు

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

రాజాం సిటీ: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలే కాకుండా మరిన్ని పథకాలు అమలుచేసి నాలుగేళ్లలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చారని తెలిపారు. రాజాం మున్సిపాల్టీ పరిధి డోలపేట గ్రామంలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు చేరుకుని సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కారానికే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. పథకాలు అందుతున్న తీరుపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మహిళలకు పలు పథకాలతో కూడిన కరపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సమస్యలుపై స్పందించి సమస్య పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, నాయకులు పొట్నూరు లక్ష్మణరావు, పాలవలస గోపి, గోకవలస బాబూరావు, శాసపు వేణుగోపాలనాయుడు, దూబ గోపాలం, పొట్టా సత్యనారాయణగుప్త, కెంబూరు నారాయణరావు, పిట్టా జగదీష్, మున్సిపల్ ఏఈ రత్నాకర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.


పథకాలపై మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగులు

ప్రజావేదిక వాయిదా

సంతకవిటి: మండల కేంద్రంలో సామాజిక తనిఖీల బృందం నిర్వహించాల్సిన ప్రజావేదిక రద్దయిందని ఏపీఓ త్రినాధరావు వెల్లడించారు. బుధవారం ఈ వేదిక నిర్వహించాల్సి ఉండగా, జిల్లా అధికారులు వాయిదా వేశారని, తదుపరి నిర్వహణ సమయాన్ని వెల్లడిస్తామని తెలిపారు. 20 రోజుల పాటు మండలంలో డీఆర్‌పీల బృందం 2021 – 22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించిందని తెలిపారు.

కమిషనర్ సుడిగాలి పర్యటన


అధికారులు, సిబ్బందికి ఆదేశాలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని మల్లంపేట వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు సుడిగాలి పర్యటన చేశారు. బుధవారం తన సిబ్బందితో వెళ్లిన కమిషనర్ శ్రీనివాసరావు అక్కడి ప్రజల అవసరాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలిచ్చారు. ఈ నెలలో అమ్మవారి పండుగ సందర్భంగా వార్డుల్లో శానిటేషన్ పనులు చేపట్టాలని ఆదేశించారు. సిరిమాను తిరిగే వీధుల్లో ఆక్రమణలుంటే తొలగించాలన్నారు.

ఘనంగా పాదాలమ్మ ఉత్సవాలు


పాదాలమ్మ పండుగలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

రాజాం: మండలంలోని ఆగూరు గ్రామంలో గ్రామ దేవత పాదాలమ్మ ఉత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు గ్రామస్తులు అంతా భక్తిశ్రద్ధలతో ఈ పండుగను చేసుకున్నారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తదితరులు పాల్గొని పాదాలమ్మకు పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, పొట్నూరు లక్ష్మణరావు, రాజాం వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, పంచాయతీ సర్పంచ్ కోనారి అనూష తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత


బాధితురాలికి బీమా తక్షణ సాయం అందజేస్తున్న వైస్ ఎంపీపీ తదితరులు

రాజాం సిటీ: మండల పరిధి బొద్దాం గ్రామానికి చెందిన గంగు సత్యవతికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం వైస్ ఎంపీపీ నక్క వర్షిణి బుధవారం అందజేశారు. బాధితురాలి భర్త రాము మృతి చెందడంతో తక్షణ సాయం కింద రూ.10వేలు అందజేశామని తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్ బీమా కుటుంబానికి ఆసరాగా నిలుస్తుందని అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు నక్క శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సరుకుల నిల్వల్లో తేడాలుంటే క్రిమినల్ కేసు

- రేషన్ దుకాణాల ఆకస్మిక తనిఖీలు

రామభద్రపురం: రేషన్ దుకాణాల్లోని సరకుల నిల్వల్లో తేడాలు వస్తే సంబంధిత రేషన్ దుకాణ డీలర్‌పై 6ఎ కేసుతో పాటు క్రిమినల్ కేసు కూడా నమోదు చేస్తున్నామని శ్రీకాకుళం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఆర్.అప్పలనాయుడు హెచ్చరించారు. మండలంలోని బూసాయవలస రేషన్ దుకాణాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూసాయవలస రేషన్ దుకాణంలో ఉండాల్సిన నిల్వల్లో 25 క్వింటాళ్ల బియ్యం, 191 ప్యాకెట్లు గోధుమ పిండి తేడా ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రభుత్వం పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ సరుకులను పంపిణీ చేయకుండా సంబంధిత డీలర్లు నిర్లక్ష్యం వహించడంతో పాటు అవినీతికి పాల్పడినట్లు తనిఖీలో గుర్తిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించమన్నారు. బూసాయవలసలో రేషన్ దుకాణంలో గుర్తించిన తేడాలను నివేదిక రూపంలో స్థానిక తహసీల్దార్‌కు అందజేస్తున్నామన్నారు. సంబంధిత డీలర్‌పై 6ఏ కేసుతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నామన్నారు. సీఎస్‌డీటీ ఆర్.సాయికృష్ణ తనిఖీలలో పాల్గొన్నారు.


బూసాయవలస రేషన్ దుకాణంలో సరుకుల నిల్వలు పరిశీలిస్తున్న సీఐ

రామారాయపురంలో గ్రామ సభ

సంతకవిటి: మండలంలోని రామారాయపురం గ్రామంలో బుధవారం సామాజిక తనిఖీల గ్రామ సభ నిర్వహించారు. 2021 – 22 ఆర్థిక సంవత్సరంలో ఈ పంచాయతీలో ఉపాధి శాఖతో పాటు అనుబంధ శాఖలు ద్వారా జరిగిన పలు పనులకు సంబంధించి ఖర్చు చేసిన వ్యయంపై ఈ తనిఖీలు సామాజిక తనిఖీల బృందం నిర్వహించింది. నాలుగు రోజులు క్షేత్ర స్థాయిలో పరిశీలనలు అనంతరం డీఆర్‌పీలు రామకృష్ణ, ప్రసాద్ తదితరులు వివరాలు వెల్లడించారు. గ్రామస్తులు నుంచి సలహాలు తీసుకున్నారు. ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి, ఏపీఓ త్రినాధరావు, ఈసీ మురళి, ఫీల్డ్ అసిస్టెంట్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


రామారాయపురంలో గ్రామ సభ నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్ టీం

ఫీల్డ్ అసిస్టెంట్లకు నియామక పత్రాల అందజేత

సంతకవిటి: మండలంలో కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌ల పోస్టులను భర్తీ చేసి నియామక పత్రాలు బుధవారం అందజేశారు. వాల్తేరు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పప్పల సంధ్య, తమరాం ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఎస్.రంగారావు, కాకరాపల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌గా ప్రసాదరావులను నియమిస్తూ వచ్చిన ఉత్తర్వుల మేరకు వారికి జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు నియామక పత్రాలు అందించి అభినందనలు తెలిపారు. గ్రామాల్లో సక్రమంగా పనులు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి, సర్పంచ్ యడ్ల రామకృష్ణనాయుడు తదితరులు పాల్గొన్నారు.


నియామక పత్రాలు అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్

ప్రజలకు అందుబాటులో సంక్షేమం

బొబ్బిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని పదో వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే శంబంగి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రతీ ఇంటికీ వెళ్లి వారికి కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా మహిళలు సంక్షేమ పథకాలు మాకు వర్తిస్తున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే వార్డులో ఉన్న సమస్యలను గుర్తించామని, త్వరలోనే వాటికి కూడా పరిష్కారం చూపిస్తామన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని సంక్షేమ పాలన సాగుతోందని, రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను ఎన్నుకోవాలని కోరగా మహిళలు, ప్రజలు సంతోషంగా అంగీకరించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షుడు ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాల నాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వరరావు(విసు), వార్డు ఇన్‌చార్జి తుట్ట తిరుపతి, మండల జనార్ధన రావు, దమ్మా అప్పచ్చి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల అమలును వివరించి బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

వేగవంతంగా సర్వే రాళ్లు వేయండి

తెర్లాం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన భూముల సరిహద్దులు గుర్తింపు ప్రక్రియ పూర్తయిన గ్రామాల్లో సర్వే రాళ్లు వేయడం జరుగుతుందని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని కొరటాం, కూనాయవలస గ్రామాల్లో బుధవారం ఆయా గ్రామాల సర్పంచ్‌లు, రైతుల సమక్షంలో సర్వే రాళ్లు వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూముల రీసర్వే, సరిహద్దుల గుర్తింపు పూర్తయిన గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన సర్వేరాళ్లు వేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో సర్వేరాళ్లు వేస్తున్నప్పుడు రైతులు, సంబంధిత గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు దగ్గర ఉండాలన్నారు. వీఆర్‌ఓలు, సచివాలయ సర్వేయర్లు గ్రామాల్లో సర్వే రాళ్లు వేస్తున్నప్పుడు ఎటువంటి పొరపాట్లు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని వెలగవలస, కొరటాం, కూనాయవలస గ్రామాల్లో సర్వేరాళ్లు వేయడం సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను తహసీల్దార్ ఆదేశించారు. ఆయనతో పాటు కూనాయవలస సర్పంచ్ బోడెల విజయబాబు, మండల సర్వేయర్ వెంకటరమణ, వీఆర్‌ఓలు, సచివాలయ సర్వేయర్లు ఉన్నారు.


కూనాయవలసలో సర్వేరాళ్లు వేయడాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు, సర్పంచ్ విజయబాబు

దివ్యాంగుల అభ్యున్నతే ధ్యేయం

- మెగా ఉపకరణాల గుర్తింపు శిబిరంలో ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆలిమ్‌కో సంస్థ సహకారంతో ఉపకరణాల గుర్తింపు మెగా శిబిరాన్ని బుధవారం స్థానిక శ్రీ కళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో నిర్వహించారు. శిబిరానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ఏ రంగంలోనూ తీసిపోరని వారికి అవసరమైన పరికరాలు, సహాయ సహకారాలు అందిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటోందన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ జీవీబీ జగదీష్ మాట్లాడుతూ మొత్తం నాలుగు విభాగాల్లో దివ్యాంగుల గుర్తింపు శిబిరాన్ని నిర్వహించామన్నారు. దివ్యాంగులను గుర్తించేందుకు ఢిల్లీ నుంచి 8 మంది వైద్యులు వచ్చారన్నారు. బుధవారం నిర్వహించిన శిబిరానికి 500 మంది శిబిరానికి రాగా అందులో 310 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. వీరికి రెండు నెలల్లో ఉపకరణాలు అందజేస్తామని తెలిపారు. శిబిరానికి సహాయకారులుగా నాలుగు మండలాల నుంచి ఎంపీడీఓలు, సచివాలయ సిబ్బంది హాజరయ్యారు. దివ్యాంగులకు బాడంగి మండలం వాడాడా పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరాన్ని నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా 10 మంది దివ్యాంగులకు రూ.92వేల విలువైన మోటారు త్రీవీలర్స్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు చేతుల మీదుగా అందజేశారు. వైఎస్సార్ సీపీ దివ్యాంగ విభాగం జిల్లా అధ్యక్షుడు దవడ కొండబాబు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, జడ్పీటీసీ సభ్యులు సంకిలి శాంతకుమారి, వెలుగు, దివ్యాంగ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


దివ్యాంగులకు మోటారు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి తదితరులు

చురుగ్గా బోరుబావుల మరమ్మతు పనులు

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు మరమ్మతులకు గురైన బోరుబావులను సర్పంచ్‌లు బాగు చేయిస్తున్నారు. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచనల మేరకు పలు గ్రామాల సర్పంచ్‌లు మరమ్మతులకు గురైన బోర్లను బాగు చేయిస్తున్నారు. మండలంలోని నందిగాం గ్రామంలో మరమ్మతుకు గురైన బోర్లను సర్పంచ్ ఆర్నేపల్లి గంగ శంకరరావు ఆధ్వర్యంలో బుధవారం బాగు చేసి ప్రజలకు తాగునీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. తాగునీటి కొరత లేకుండా చేసిన సర్పంచ్‌ను గ్రామస్తులు అభినందించారు.